క్లుప్తంగా

డీఎడ్ పరీక్ష కేంద్రం తనిఖీ



డీఎడ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వీసీ డీవీఆర్ మూర్తి

ఒంగోలు: స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డీవీఆర్ మూర్తి గురువారం యూనివర్శిటీ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు పరీక్షలను రాస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఏకేయూ కాలేజీ పరీక్ష కేంద్రంలో శారద బీపీఈడీ కాలేజీ (మేదరమెట్ల), ఏకేయూ వ్యాయామ విద్యా కళాశాలకు చెందిన విద్యార్థులు మొత్తం 109 మంది హాజరవుతున్నారని వీసీ తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ జి.రాజమోహన్ తదితరులున్నారు.

వృద్ధ దంపతులకు పూనాటి సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పూనాటి వెంకట్రావు

చీమకుర్తి: పింఛను రాక అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధ దంపతులకు చీమకుర్తికి చెందిన పూనాటి వెంకట్రావు రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. అంతే కాకుండా వారికి నెలనెలా మందులకు కావాలసిన డబ్బులను అందించేందుకు భరోసా ఇచ్చారు. చీమకుర్తి విద్యానగర్‌లో నివాసం ఉంటున్న బందారు సుబ్బారావుకు పింఛను రావడం లేదు. ఆయన భార్య ఆదిలక్ష్మి కీళ్ళ వాతంలో ఇబ్బంది పడుతోంది. దీంతో శివం ఫౌండేషన్ వారి సహకారంతో పూనాటి వెంకట్రావు దృష్టికి తీసుకుపోవడంతో గురువారం వారి ఇంటికెళ్ళి ఆర్థిక సాయం అందించారు. శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి హరితో పాటు స్థానికులు.. పూనాటి వెంకట్రావును అభినందించారు.

శ్రీనివాసరావు అంకిత భావం స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న డాక్టర్ డి.కళ్యాణి

ఒంగోలు: స్థానిక డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో భౌతిక శాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన బిట్రగుంట శ్రీనివాసరావును కాలేజీ సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి మాట్లాడుతూ శ్రీనివాసరావు వృత్తిపట్ల నిబద్ధత, కార్యసాధకత అందరికీ ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా సహ అధ్యాపకులు శ్రీనివాసరావుతో తమకు ఉన్న అనుబంధాన్ని గురించి వివరించారు. అనంతరం ఘనంగా సత్కరించారు. అధ్యాపకులు పి.యామిని అమ్మాజి, డాక్టర్ ఏవీ రాజ్యలక్ష్మి, డాక్టర్ పి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ కమిషనర్ ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో దేవదాయ ధర్మాదయ శాఖ కమిషనర్ సత్యనారాయణ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం ఆలయాలను సదర్శించిన ఆయనకు ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి, అర్చకులు ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రిలు సాదర స్వాగతం పలికారు. ఆలయాల్లో కుంకుమార్చనలు, అభిషేకం నిర్వహించారు. ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటాలు అందజేశారు.


ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

పుల్లలచెరువు: ఈ నెల 8వ తేదీన ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం స్థానిక జెడ్పీ పాఠశాలలో హెచ్ఎం ఉమామహేశ్వరరావు విడుదుల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వ తేదీన ఓటరు జాబితా ప్రదర్శన, 5వ తేదీన ఓటర్ జాబితాపై అభ్యంతరాల స్వీకరన, ఫిర్యాదులు ఉంటే పరస్కరించడం, 8వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ మాడిశెట్టి ప్రకాష్ పాల్గొని పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు కూడా పంపిణీ చేశారు.

దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయ స్వామి



సాయిబాబా పూజలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: నగరంలోని షిరిడీ సాయిబాబా మందిరాల్లో గురువారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పల్లకి సేవ నిర్వహించారు. లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరం, కర్నూల్ రోడ్డు సాయిబాబా మందిరం, హౌసింగ్ బోర్డ్ లోని షిరిడీ సాయిబాబా సంతపేట షిరిడీ సాయిబాబా మందిరం, పేర్నమిట్ట బాబా మందిరంలో వివిధ రకాల పూలతో పుష్పాలంకరణ గావించారు. మందిరంలో ఉన్న దత్తాత్రేయ స్వామి వారికి ఆలయ అర్చకులు ఉదయం ఏడు గంటలకు స్వామివారి మూలవిరాట్‌కు ఆవుపాలు, పెరుగు, తేనె, చక్కెర, పన్నీరు, కొబ్బరి నీళ్లు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. మందిరం చుట్టూ మహిళలు కోలాటం నృత్య ప్రదర్శనతో పల్లకి సేవ ఉత్సవంలో పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో గుర్తింపు



మాట్లాడుతున్న నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి

ఒంగోలు: స్థానిక క్విస్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం ప్రారంభ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇస్రో సైంటిస్ట్ సుబ్బారావు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలతో మంచి ఇంజినీర్లుగా ఎదుగుతారన్నారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగంలో వచ్చిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి నూతన ఒరవడులను నేర్చుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. క్విస్ కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ సూర్య కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు కోటి రూపాయల ప్యాకేజీ అందుకోవాలంటే.. కంప్యూటర్ లాంగ్వేజ్‌తోపాటు ప్రోడక్ట్ డెవలప్‌మెంట్‌లో నైపుణ్యం సాధించాలన్నారు. విద్యతో పాటు మానవ విలువలు పెంచుకోవాలని సూచించారు. ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. కాలేజీ ఉపాధ్యక్షుడు బి.చెంచు ప్రసాద్ మాట్లాడుతూ పుట్టుక సాధారణం అయినప్పటికీ చదువు వల్ల చరిత్ర సృష్టించవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు మొదటిగా తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని మంచి స్నేహితులను కలిగి ఉండాలన్నారు. ఎన్‌బీఏ టైర్ 1 ఇనిస్టిట్యూట్‌గా ఎదిగేందుకు, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ (151-300) సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు.

మొదటి సంవత్సరం హెచ్ఓడీ డాక్టర్ జి.శ్రీనివాసరావు, కాలేజీ డీన్, హెచ్ఓడి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం



చిన్నారులకు ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ కోటేశ్వరరావు

పెద్దారవీడు: ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరమవుతుందని డాక్టర్ కోటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం పెద్దారవీడు భవిత కేంద్రంలో 9 మందికి ఫిజియోథెరపీ గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించుకుంటే వైకల్యం దూరమై సాధారణ స్థితికి చేరుకుంటారని తెలిపారు. ప్రతి గురువారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహిస్తారని, మిగిలిన రోజుల్లో ఇంటి వద్ద పిల్లలకు వ్యాయామం చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐఈఆర్టీలు బాలవర్ధిరాజు, బీబీ, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలకు బిల్లులు ఇవ్వాలి



ఉద్యాన పంటను పరిశీలిస్తున్న పీడీ అర్జున్‌రావు

పెద్దారవీడు: ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటిన రైతులకు వెంటనే బిల్లులు మంజూరు చేయాలని డ్వామా పీడీ అర్జున్‌రావు ఆదేశించారు. మండలంలో దేవరాజుగట్టు గ్రామంలో రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలను పరిశీలించిన అనంతరం ఎంపీడీ కార్యాలయంలో ఉపాధి, సచివాలయం సిబ్బందితో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సాగు చేసిన మొక్కల సంరక్షణలో రైతులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్థానిక కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అలసత్వం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్క సచివాలయం సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ అందజేయాలని చెప్పారు. ఏపీడీ నిర్మలాదేవి, ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఏపీఓ మంత్రునాయక్, క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు

పారిశుధ్య పనులు

ముండ్లమూరు: మండల కేంద్రం ముండ్లమూరులో గురువారం పంచాయతీ కార్యదర్శి రాజశేఖరరెడ్డి పారిశుధ్య పనులు చేయించారు. గ్రామ ప్రధాన వీధుల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని పారిశుధ్య కార్మికులు తొలగించారు. మురుగు నీటిలో దోమలు ఉత్పత్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టారు. రోడ్ల వెంబడి చిల్లచెట్లు తొలగించారు. బ్లీచింగ్, ఫినాయిల్ పిచికారీ చేయించారు.

నూరు శాతం పింఛన్ల పంపిణీ లక్ష్యం



సచివాలయంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్



క్రిస్టియన్ పేటలో పింఛన్లు అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్, ఎంపీడీఓ

ఒంగోలు రూరల్: నూరు శాతం పింఛన్ల పంపిణీ లక్ష్యమని డిప్యూటీ కలెక్టర్, జెడ్పీసీఈఓ కె. మాధురి అన్నారు. రూరల్‌లోని కరవది గ్రామ సచివాలయాన్ని ఉదయం పది గంటలకు ఆమె ఆకస్మికగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలి రోజు నూరు శాతం పింఛన్ల పంపిణీ చేయాలని రూరల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పది గంటలకు అన్ని రకాల పింఛన్లను లబ్దిదారులకు అందజేసినట్లు తెలిపారు. మండలంలో 99 శాతం తొలి రోజు పంపిణీ లక్ష్యంగా నిర్ణయించినట్లు డిప్యూటీ కలెక్టర్ ఆయనకు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీడీఓలు పరిశీలించారు. అనంతరం ఒంగోలు మండలంలో గత నెలలో 9731 పింఛన్లను అందజేశామని, ప్రస్తుతం 3722 పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. తొమ్మిది మంది పింఛన్ దారులు మృతిచెందడంతో అవి మిగిలిపోయాయని చెప్పారు. పది గంటలకు 2,862 పింఛన్లను పంపిణీ చేయగా 77 శాతం నమోదైనట్లు ఆమె తెలిపారు. ఈసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ వృద్ధాప్య పింఛన్లు రూ.4వేలు అందజేసినట్లు, ఆయా పింఛన్లను ఇంటింటికీ తిరిగి సచివాలయ సిబ్బంది పంపిణీ చేసినట్లు చెప్పారు. అనంతరం రేండమ్ సర్వే పరిశీలించారు. క్రిస్టియన్ పేటలో స్వయంగా అందజేశారు. ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏవో శ్రీనివాసులరెడ్డి, కరవది పంచాయతీ కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, ఇంజినిరింగ్ అసిస్టెంట్ అనూష ఉన్నారు.

సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం



సంబరాలు చేసుకుంటున్న జెడ్పీటీసీ, దళిత నాయకులు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

దర్శి: ఎస్సీ,ఎస్టీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై దళిత ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. మాదిగ మహానాడు జిల్లా అధ్యక్షుడు గట్టుపల్లి ప్రసాద్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ప్రజా సంఘాల నాయకులు గర్నెపూడి ప్రేమ్‌కుమార్, కవలకుంట్ల గోవింద్ ప్రసాద్ మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి దేశ వ్యాప్తంగా సుదీర్ఘ పోరాటాలు చేసినట్లు తెలిపారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నవరపు వెంకటేశ్వర్లు, రాచపూడి మోషే, గట్టుపల్లి ప్రసాద్, వెంకటశేషయ్య, మోహన్ పాల్గొన్నారు.

ముండ్లమూరు: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరించడంపై జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎస్సీ కాలనీలో గురువారం దళిత నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా రత్నరాజు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల అలుపెరగని పోరాట ఫలితమే నేడు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు తమ ప్రాణాలను సైతం లెక్కచేయక పోరాటాలు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా మందా కృష్ణకు ధన్యవాదాలు తెలుపుతూ కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. దళిత నాయకులు పాలెపోగు డగ్లస్, దాసరి దాసు, తప్పెట డేవిడ్, తాతపూడి శాంతకుమార్, పెదరోశయ్య, పెద సుబ్బయ్య, గద్దల యోహాన్, తాతపూడి కోటేశ్వరరావు, గండి శ్రీను పాల్గొన్నారు.

దొనకొండ: సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ ఇచ్చిన తీర్పుకు దొనకొండ ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం తమ హర్షం వ్యక్తం చేశారు. చారిత్రాత్మక తీర్పు కోసం 20 ఏళ్లుగా వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నామని, భారత సర్వోన్నత న్యాయ స్థానం తీర్పు ఎస్సీ ఉపకులాలకు ఎంతో మేలు చేకూరిందన్నారు. స్థానిక బేతేలుపురం ఎమ్మార్పీఎస్ నాయకులు బస్టాండ్ సెంటర్‌లో మాదిగల ఆరాధ్య దైవమైన మంద కృష్ణమాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పలపాటి కిరణ్, కొంగలేటి దేవానంద్, గుంటు అజయ్, మణీందర్‌దేవ్, సంతోష్, శ్యాంసన్ పాల్గొన్నారు.

స్మోకింగ్ నష్టాలపై అవగాహన పెంచుకోవాలి



ప్రదర్శన ఇస్తున్న అధికారులు, సిబ్బంది

ఒంగోలు: పొగ తాగడం వల్ల కలిగే నష్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర పొగాకు నియంత్రణ సెల్ లీగల్ అడ్వైజర్ పి.శివశంకర్ సూచించారు. జాతీయ పొగాకు నియంత్రణ ప్రచారంలో భాగంగా గురువారం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక ఏబీయం కాలేజీలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాల్లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు విక్రయించరాదన్నారు. మైనర్ బాలలకు పొగాకు ఉత్పత్తులు అమ్మిన వారికి జరిమానా విధిస్తామన్నారు. ప్రతి పాన్ షాపు ముందు పొగతాగరాదనే నినాదంతో బోర్డు ఉంచాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయరాదన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ కార్యక్రమ అధికారి డాక్టర్ భగీరధి, పి.రాజేశ్వరి, మానసిక నిపుణుడు శ్రీనివాసులు, ఎంవీఐ ఎల్.సుందర్ ప్రసాద్, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



కొలచనకోట వద్ద గుండ్లకమ్మ రేవు సమీపంలో సీజ్ చేసిన జేసీబీ



ఇసుక అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

మద్దిపాడు: మండలంలోని కొలచనకోట సమీపంలో గుండ్లకమ్మ నది వద్ద విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ముఠాలు ఏర్పాటు చేసుకుని కొన్ని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుంటే మరోవైపు జేసీబీలతో తవ్వేస్తున్నారు. ఈక్రమంలో గురువారం విలేకరులు కొలచనకోట గుండ్లకమ్మ పరివాహక ప్రాంతానికి వెళ్లగా జేసీబీ, ట్రాక్టర్లు కనబడ్డాయి. ఎందుకు తరలిస్తున్నరన్న సమాచారం గురించి విలేకరులు ఆరా తీస్తుండగా వీఆర్ఓ అక్కడికి వచ్చారు. అప్పటికే కొన్ని ట్రాక్టర్లతో అక్రమార్కులు పారిపోయారు.

వెంటనే అక్కడ ఉన్న రెండు ట్రాక్టర్‌లను జేసీబీని పట్టుకుని మద్దిపాడు ఎస్ఐకి సమాచారం ఇవ్వగా వాటిని సీజ్ చేశారు.

అలరించిన గజేంద్ర మోక్షం ప్రవచనం



పింగళి పూర్ణచంద్రరావు సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక వీఐపీ రోడ్డు వారి కార్యాలయ ఆవరణలో గురువారం గజేంద్రమోక్షం ఘట్టాన్ని పింగళి పూర్ణచంద్ర రావు, పింగళి శ్రీనివాసరావు ప్రవచనం చేశారు. ఇది శ్రోతలను అలరించింది. మాగంటి శ్రీరామ మూర్తి, చదలవాడ లక్ష్మీనరసింహ రావు, ఎ.కోదండరాం, జంధ్యాల కామేశ్వరి, అనఘా వేంకట సుబ్బారావు, పింగళి రామ, మోహనరావు, రావినూతల వరలక్ష్మి పాల్గొన్నారు.

చీమకుర్తిలో ఎంఆర్పీఎస్ ర్యాలీ



చీమకుర్తి మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్పీఎస్ నాయకులు

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ ఎంఆర్పీఎస్ నాయకులు గురువారం చీమకుర్తిలో భారీ ర్యాలీ నిర్వహించారు. గత 30 సంవత్సరాలుగా మందా కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఎంఆర్పీఎస్ చేసిన పోరాటం విజయవంతం అయినందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌లకు ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందా కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎంఆర్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బొంతా ఏసుదాస్, పాటిబండ్ల జక్రయ్య, బిరుదల లింగయ్య, జనరాజుపల్లి యాకోబు, కర్నా ప్రసాద్, జడ విజయ కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

పొగాకు కేజీ గరిష్ట ధర రూ.360

ఒంగోలు సెంట్రల్: పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలోని వేలం కేంద్రాల్లో గురువారం నిర్వహించిన వేలంలో కేజీ గరిష్ట ధర రూ.360 పలికింది. ఆర్ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో గురువారం మొత్తం 10,362 బేళ్లు వేలానికి రాగా, 9,283 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,079 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలులోని రెండు కేంద్రాలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 120వ రోజు వేలం పాటలో 5,192 బేళ్లు వేలానికి రాగా, 4,616 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 576 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.302.30 పలికింది. కందుకూరు-1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి కేంద్రాల్లో 114వ రోజు నిర్వహించిన వేలానికి 5,170 బేళ్లు రాగా, 4,667 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 503 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.360, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.309.67 పలికింది.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ సావిత్రి, పక్కన వైద్యాధికారులు

మార్కాపురం: తల్లిపాలు బిడ్డకు ఇస్తే వారు ఆరోగ్యకరంగా, మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉంటారని మార్కాపురం జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సావిత్రి అన్నారు. స్థానిక జీజీహెచ్‌లో ఆర్‌బీఎస్‌కె కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబ్బా పాలకంటే తల్లిపాలలో అధిక పోషకవిలువలు ఉంటాయని, తల్లిపాలు తాగడం వల్ల వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉండి సీజనల్ వ్యాధులను తట్టుకునే శక్తి ఉంటుందని తెలిపారు. డబ్బా పాలు తాగడం వల్ల పలురకాల సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. నవజాత శిశువులకు ప్రతి రెండు గంటలకొకసారి తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ప్రయాణ సమయాల్లో లేదా బయటకు వెళ్లినప్పుడు బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్, ప్రభుత్వ వైద్యశాలలు తదితర కార్యాలయాల్లో ప్రభుత్వం మదర్‌ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారని, పాలిచ్చే తల్లులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజమన్నార్, ఆర్ఎంఓ డాక్టర్ రామచంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ సుబ్బారెడ్డి, గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ కేశవ చంద్ర, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తూర్పు వీధిలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.